క్లుప్తంగా

నేటి నుంచి నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు



కొబ్బరితోటలో కొలువైన నూకాంబిక అమ్మవారు

అల్లిపురం: కొత్త అమావాస్య సందర్భంగా కొబ్బరితోటలోని శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయం, నేతాజీనగర్‌లో గల నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో సోమవారం, మంగళవారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, ఘటాల ఊరేగింపు కొబ్బరితోట, నేతాజీనగర్, ఎస్‌వీపీ నగర్ ప్రాంతాల్లో జరగుతాయన్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఫాల్గుణ మాసం ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నేతృత్వంలో పూజారి శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు సరైన నీడ లేక వర్షానికి తడిసి ముద్దయిపోయారు. మౌలిక వసతులు కల్పించాలని ఈ సందర్భంగా పలువురు భక్తులు కోరారు.

తెలుగు పాటకు ఆస్కార్ గొప్ప విషయం



మాట్లాడుతున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం సంతోషించ దగ్గ విషయమని గోపాలపట్నం కళాసేవా పీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు అన్నారు. గోపాలపట్నంలోని పీఠం కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆస్కార్‌తో తెలుగు చిత్ర కీర్తి విశ్వవ్యాప్తమైందన్నారు. కార్యక్రమంలో సభ్యులు జి.అప్పారావు, డి.సింహాచలం నాయుడు, వెంకట్, శ్రీనివాసరావు, నూక రాజేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

ముస్లిం వివాహ పరిచయ వేదికకు స్పందన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ హైదర్ ఆలీ సింకా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ముస్లిం వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. నగరంతోపాటు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిం కుటుంబాలు పాల్గొన్నాయి. వధూవరుల తల్లిదండ్రులు వారికి కావలసిన అర్హతలను బట్టి తమ పిల్లలకు సంబంధాలను కుదుర్చుకున్నారు.

నిశ్శబ్దంగా.. నిర్మానుష్యంగా

- దక్షిణానికి క్రికెట్ ఫీవర్
- బోసిపోయిన రోడ్లు.. కాలనీలు
- టీవీలకు అతుక్కుపోయిన జనం



నిర్మానుష్యమైన రామాటాకీస్ రోడ్డు..



నిత్యం రద్దీగా కనిపించే ద్వారకానగర్ రోడ్డు ఇలా బోసిపోయి కనిపించింది

డాబాగార్డెన్స్: అసలే ఆదివారం. ఆపై నగరంలో భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్. ఇంకేముంది.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగర రోడ్లన్నీ కిటకిటలాడాయి. బజార్లు కళకళలాడాయి. పనులున్న వారు పనులు చూసుకుని మధ్యాహ్నానికి ఇంటికి చేరారు. ఏదో తిన్నామనిపించి అందరూ టీవీలకు అతుక్కుపోయారు. చాలా మంది వన్డే క్రికెట్ మ్యాచ్‌ను లైవ్‌లో చూసేందుకు పరుగులు తీశారు. దీంతో మధ్యాహ్నం ఒంటిగంట వరకు కిటకిటలాడిన రోడ్లన్నీ మూగబోయాయి. బజార్లు వెలవెలబోయాయి. ప్రయాణికుల రాకపోకలు పెద్దగా సాగలేదు. నగరంలోని ప్రధాన జంక్షన్లు.. రహదారులు ఒకింత బోసిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే జగదాంబ జంక్షన్, ద్వారకానగర్, పూర్ణామార్కెట్, కంచరపాలెం, అల్లిపురం, దొండపర్తి.. ఇలా అన్ని రోడ్లు వెలవెలబోయాయి. దక్షిణంలోని వీధులు కూడా జనసంచారం లేక ఖాళీగా కనిపించాయి. అంతా ఇళ్లలోనే టీవీలో మ్యాచ్ చూస్తూ గడపడంతో సద్దుమణిగి కనిపించాయి.

మాతృమూర్తులకు సన్మానం



మాతృమూర్తులను సత్కరిస్తున్న గీతా మకరందం సభ్యులు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ట్రాఫిక్ విభాగం డీహెచ్‌టీకి చెందిన గీతా మకరందం సభ్యులు సీహెచ్ మసేను, నక్కా అప్పారావు, జి.ధనరాజు గత ఐదేళ్లుగా మాతృమూర్తుల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మాతృమూర్తులను సన్మానించారు. బి.దేవుడు, డి. ఎల్లారావు, నర్సింగరావు, పిల్లి రమణ, వాసుపల్లి కోదండరావు, పోలవరపు నూకాలమ్మ దంపతులతో పాటు 40 మంది మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. మాతృదేవోభవ పేరిట జరిగిన ఈ కార్యక్రమం అనంతరం అన్నసమారాధన చేపట్టారు. స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు



నీటిశుద్ధి యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఉషామాధవి

మహారాణిపేట : టచ్ స్టోన్ చారిటీస్, హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా కేజీహెచ్ సుభోజనం వద్ద నీటిశుద్ధి యంత్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ సేవలను గుర్తించి ఈ యంత్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. దీని ద్వారా రోజుకు 200 నుంచి 1000 లీటర్ల మంచినీరు రోగి సహాయకులకు అందుతుందని రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్‌కు చెందిన దత్త సుబ్బారావు తెలిపారు. తమకు సహకరించిన వారికి శ్యామ మాధవదాస ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ కపుల్స్ జిల్లా గవర్నర్ దత్త సుబ్బారావు, క్లబ్ వైజాగ్ సెక్రటరీ వి.ఉషామాధవి, అధ్యక్షుడు సుబోధ్‌కుమార్, హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు చెందిన యదురాజాదాస, స్వచ్ఛంద సేవకులు కృష్ణారావు, టచ్ స్టోన్ చారిటీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ క్లబ్‌లో చిన్నారుల పుస్తక పఠనం



చిల్డ్రన్‌క్లబ్ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

అల్లిపురం: బంగారుమెట్ట శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి ఒక సమూహంగా ఏర్పడాలన్నారు. పుస్తకాలు చదువుతూ, ఒకరికొకరు వివరించుకుంటూ విజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలిపారు. చిల్డ్రన్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమర యోధుల గురించి చిన్నారులకు వివరించారు. బొమ్మరిల్లు, చందమామ, కామిక్స్, విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లలు శ్రద్ధతో చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు బాగా ఉపయోగపడతాయని వివరించారు. చిన్నారులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీమాత పూజలు



తుంగ్లాంలోని సత్యశ్రీనివాస ఆలయంలో శ్రీ గాయత్రి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో గల శ్రీ సత్యశ్రీనివాస ఆలయంలో శ్రీ గాయత్రీ మాత 12వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఆలయంలో గాయత్రీ మాత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము నుంచే విఘ్నేశ్వర పూజ, మండపార్చన, గాయత్రీ హోమం వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నారాయణ సేవ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కె. వెంకటరావు, కె.సాయిధర్మ, నావాన సింహాచలం, నందీశ్వరరావు, గిడితూరి అప్పారావు, రాకేష్, రాజేష్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తరలివెళ్లారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు ప్రోగ్రాం అధికారిగా ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-వాహనాలతో కాలుష్యానికి చెక్



ఈ-వాహనాల వినియోగంపై అవగాహన కలిగిస్తున్న విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: కాలుష్యం కట్టడికి విదేశాల్లో విరివిగా ఈ–వాహనాలే వాడుతున్నారని, పూర్తి అవగాహన కలిగి ఉండడంతో ఇది సాధ్యమైందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల పోకడలు, సవాళ్లు, అవకాశాలపై కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రోజులతో పాటు భవిష్యత్‌లో కూడా ఈ–వాహనాలకు మంచి గిరాకీ ఉంటుందని, వాహనాల వాడకం పెరుగుతుందన్నారు. ఈ వాహనాల పనితీరు బ్యాటరీ సెల్స్ ఆకారం, పరిమాణం, పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. మరింత మెరుగు పర్చుకుని వినియోగదారులకు నాణ్యమైన వాహనాలు అందించేందుకు సంస్థలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కార్యక్రమ కోఆర్డినేటర్లు సుశాంత్‌కుమార్ సాహు, సీహెచ్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థినుల వసతి గృహంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని వసతిగృహంలోని విద్యార్థినులకు నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య సీహెచ్ ఆశా ఇమ్మానియేల్‌రాజు, వార్డెన్ డాక్టర్ రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన అవసరం



గ్లకోమా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఉష

అగనంపూడి: గ్లకోమా వల్ల శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని, ఈ విషయంలో అవగాహన కలిగి ఉండాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష అన్నారు. గ్లకోమా (నీటి కాసులు) వారోత్సవాల ముగింపు కార్యక్రమం అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్లకోమా ఆరంభ దశలో కనుగుడ్డు చుట్టూ వలయాలు ఏర్పడడం, కంటి చూపు మందగించడం, కాంతి వంతంగా లేకపోవడం, కంటి చూపు క్రమేపీ తగ్గిపోవడం, కళ్లజోడు తరచూ మార్చాల్సి రావడం, నిలకడ లేకుండా తలనొప్పి రావడం జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా గతంలో ఇలాంటి సమస్య వచ్చి ఉంటే వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సమయానికి సరైన చికిత్స జరగని పక్షంలో శాశ్వత అంధత్వం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంవో గోపాలకృష్ణ, సీనియర్ వైద్యుడు డాక్టర్ కల్యాణబాబు, ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రం డాక్టర్ ఆశాశ్రీ (ఆప్తమాలజీ), రాజశేఖర్, పీఎంవో సరళ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల వనభోజనాలు



వన భోజనాలకు తరలి వెళుతున్న డ్వాక్రా మహిళలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్ కొండవాలు ప్రాంతం డ్వాక్రా మహిళలు, స్థానికులు ఆదివారం వన భోజన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఉచితంగా బస్సు ఏర్పాటు చేయగా, వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ తమ వంతు సహకరించినట్లు సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు రాజుయాదవ్ తెలిపారు.

ఆకర్షణీయంగా 'ఐ లవ్ వైజాగ్'



సీతకొండ మలుపులో బీచ్‌రోడ్డు సీ వ్యూ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్ బోర్డు

ఆరిలోవ: విశాలాక్షినగర్ దరి సీతకొండ మలుపు వద్ద బీచ్‌రోడ్డులో జీవీఎంసీ ఏర్పాటు చేస్తున్న 'ఐ లవ్ వైజాగ్' ఆకర్షణీయంగా నిలుస్తోంది. నగరంలో ఈ నెల 28, 29 తేదీలలో జరగనున్న జీ–20 సదస్సు కోసం విశాఖ రానున్న వివిధ దేశాల ప్రతినిధులను ఆకట్టుకునేలా నగరాన్ని సుందరీకరణ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బీచ్‌రోడ్డును అందంగా తీర్చిదిద్దుతున్నారు. సీతకొండ మలుపు వద్ద సీ వ్యూ పాయింట్‌లో ఐ లవ్ వైజాగ్ అనే విడి అక్షరాలను అమర్చారు. ఈ బోర్డులో రెండు డాల్ఫిన్ బొమ్మలను లవ్ సింబల్‌గా ఉపయోగించారు. వాటి కింద రంగులు వేయడానికి ప్రస్తుతం పలకలు అమర్చుతున్నారు. దీంతో ఈ బోర్డు అటుగా వెళ్లే వాహనచోదకులు, సందర్శకులను ఆకట్టుకుంటోంది. వారు అక్కడ ఆగి సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

డాబాగార్డెన్స్: మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం కింద నెలకు 200 రోజులు పని కల్పిస్తూ, రోజుకు రూ.600 కనీస వేతనం ఇవ్వాలని సిటూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. సిటూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన చదువు, వైద్యం, నిత్యావసర సరకులు అందించాలని, ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మే ఆలోచనను బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలంటూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గంపై దాడి చేస్తుందని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, దేశంలో ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్. జ్యోతీశ్వరరావు, పి. వెంకట్‌రెడ్డి, కుమార మంగళం, బి. జగన్ పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే ఇలా..

శంకరమఠం రోడ్డులో మురుగు, చెత్తా చెదారం



శంకరమఠం వద్ద ప్రధాన రోడ్డుపై చెత్తా చెదారం



రోడ్డుపైకి ఉప్పొంగిన మురుగుతో ఇబ్బంది పడుతూనే ప్రయాణిస్తున్న వాహన చోదకులు

డాబాగార్డెన్స్: శుక్రవారం అర్ధరాత్రి నుండి వర్షం కురవడంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగర నడిబొడ్డున డ్రైన్లు ఉప్పొంగి.. ప్రధాన రోడ్లపైకి ప్రవహించాయి. చెత్తా చెదారాలు రోడ్డుపై విస్తరించాయి. విశాఖ మహానగరంలో సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్న వేళ చిన్నచిన్న తప్పుల వల్ల నగర రోడ్లు అధ్వాన్నంగా మారుతున్నాయి. రోడ్లు వేస్తున్నారు. పార్కులు అందంగా.. ఆహ్లాదంగా తీర్చిదిద్దుతున్నారు. మీడియంలో మొక్కలు వేస్తున్నారు. కానీ కాల్వల్లో పేరుకుపోతున్న చెత్తపై పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికే నగరంలో కొన్ని ప్రాంతాలు నీట మునిగాయి. కాల్వల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా మురుగు కాల్వలు పొంగిపొర్లాయి. శంకరమఠం రోడ్డులో సరిగ్గా కాల్వలు తీయకపోవడం కారణంగా చిన్నపాటి వర్షానికే చెత్తా చెదారాలు మెయిన్ రోడ్డుపైకి వచ్చేసాయి. దీంతో అటుగా వెళ్లే వాహనచోదకులు.. పాదచారులు ఇబ్బంది పడ్డారు.

ఆపన్నులకు అభయహస్తం



అనాథలకు అన్నదానం చేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ లెబన్షిల్ లైఫ్ ఫౌండేషన్‌లో ఆదివారం పలు చేయూత కార్యక్రమాలు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానసిక దివ్యాంగులు, అనాథలకు నిత్యావసర సరకులు, ఆశ్రమ నిర్వాహకుల వినతి మేరకు మిక్సీ, వెట్ గ్రైండర్ అందజేశారు. మధ్యాహ్నం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ స్వహస్తాలతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపస్సు కాలంలో ఉపవాసంతో పాటు దానధర్మాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు డి.శ్రీను, చరణ్, సుధాకర్, కుమార్, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సాధనతో మానసిక ప్రశాంతత



ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో యోగా చేస్తున్న సాధకులు



ఉపన్యసిస్తున్న ఆనంద్‌మార్గ్ ఆచార్య జ్యోతి ప్రకాష్

ఆరిలోవ: యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మిక సాధనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆనంద్ మార్గ్ సీనియర్ ఆచార్య జ్యోతి ప్రకాష్ అవధూత తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డు పరిధి డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ ఆధ్యాత్మిక సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలలో ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల నుంచి వచ్చిన ఆచార్యులు ఇక్కడ ఉచిత యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. వారితో పాటు నగరానికి చెందిన కొందరు సాధకులు కూడా ఈ శిబిరంలో పాల్గొని యోగా సాధన చేశారు. ముగింపు సందర్భంగా ఆచార్య జ్యోతి ప్రకాష్ మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఎదుగుదలకు ఆధ్యాత్మిక సాధనతో పాటు సామాజిక సేవలు కూడా అవసరమన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది సన్యాసులు, మరో 150 మంది ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల సభ్యులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పరమేశ్వర ఆనంద్ అవదూత, సౌమ్యానంద్, సుశ్రుతానంద్, ఇష్టప్రేమ, అనిమిష ఆనంద్, శుచిలేక ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా తోట పోలమాంబ పండగ



అలంకరణలో పోలమాంబ



అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

గోపాలపట్నం: బాజీ జంక్షన్ తోట పోలమాంబ కాలనీలో కొలువైన తోట పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో స్థానికులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. విద్యుద్దీపాలంకరణతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. సాయంత్రం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన పరస వద్ద జనం సందడి చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.